## ప్రశాంతంగా ముగిసిన నీట్ పరీక్ష



ప్రజాపక్షం/కరీంనగర్ : జిల్లాలో నిర్వహించిన నీట్ 2026 పరీక్ష ప్రశాంతంగా వాతావరణంలో విజయవంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. పరీక్ష నిర్వహణను ఆదివారం కలెక్టర్ మిశ్రా పోలీస్ కమీషనర్ గౌస్ ఆలంతో కలిసి పర్యవేక్షించారు. జిల్లాలోని కరీంనగర్ ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, కేంద్రీయ విద్యాలయంలో పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లు, భద్రతా చర్యలను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థుల ప్రవేశం, ద్విస్థాయి భద్రతా తనిఖీలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, బయోమెట్రిక్ ధృవీకరణ, తాగునీరు, విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. పరీక్ష సజావుగా జరిగేలా పోలీస్ శాఖ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయగా ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా అన్ని శాఖల సమన్వయంతో పని చేశాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నీట్ పరీక్ష నిర్వహణలో భాగస్వాములైన అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయడం వల్ల నీట్ పరీక్ష విజయవంతంగా పూర్తయిందని తెలిపారు. పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ పరీక్ష పారదర్శక నిర్వహణకు అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపట్టామని విద్యార్థులు ఏలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు రాసేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని అన్నారు. జిల్లాలోని మొత్తం 7 పరీక్షా కేంద్రాల్లో 3001 మంది అభ్యర్థులకు గాను 2661 మంది హాజరు కాగా 340 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష నిర్వహణలో జిల్లా విద్యాశాఖ అధికారులు, పరీక్షా కేంద్రాల ఛీఫ్ సూపరింటెండెంట్లు, పోలీస్ అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మాదకద్రవ్యాల అవగాహన వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఎస్పీ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. పోలీస్ అధికారులతో, సిబ్బందితో కలసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు , ప్రజలకు వారం రోజుల పాటు అవగాహన కల్పించే కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా గంజాయి వినియోగం వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబం,సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండడంతో పాటు ఇతరులను కూడా అప్రమత్తం చేయాలని సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో అధికారులు పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించిన యోగా కార్యక్రమాల్లో పాల్గొని విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించి విద్యార్థులతో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు. జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు కట్టుబడి ఉన్నారని, మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై ప్రజలు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ లు నాగేంద్రచారి, వెంకటేశ్వర్లు, సి.ఐ లు శ్రీనివాస్, నాగేశ్వరరావు, మొగిలి నటేష్ మధుకర్, ఆర్.ఐ లు,సిబ్బంది పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ చొరవతో సమయానికి పరీక్షకు చేరుకున్న విద్యార్థిని



ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ : కరీంనగర్‌లో నిర్వహించిన నీట్2026 పరీక్షకు హాజరయ్యేందుకు వచ్చిన ఓ విద్యార్థిని పరీక్షా కేంద్రానికి ఆలస్యమవుతుండగా విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ కుమార్ వెంటనే స్పందించి సహాయం అందించారు. విద్యార్థిని పరీక్షా కేంద్రం అయిన ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు సమయానికి చేరుకునేలా ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నియంత్రిస్తూ అవసరమైన మార్గదర్శకత్వం అందించి సకాలంలో పరీక్షా కేంద్రానికి చేర్చారు. ట్రాఫిక్ కానిస్టేబుల్ కుమార్ చూపిన అప్రమత్తత, మానవతా ధృక్పధాన్ని విద్యార్థి కుటుంబ సభ్యులతోపాటు కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలకు అవసరమైన సమయంలో సహాయం చేయడం పోలీసుల బాధ్యతలో భాగమని ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

## మాదకద్రవ్యాలపై పోలీసుల ఆకస్మిక తనిఖీలు



ప్రజాపక్షం /ముస్తాబాద్ : ముస్తాబాద్ మండలం లోని కిరణా షాపుల్లో బస్టాండ్ పరిసర ప్రాంతాలలో దుకాణాలలో మాదకద్రవ్యాలు డ్రగ్స్ గంజాయి,మత్తు పదార్థాల రవాణా విక్రయాలు అరికట్టేందుకు. ఎస్సై జ్యోతి ఆధ్వర్యంలో నార్కోటిక్ సహాయంతో తనిఖీలు నిర్వహించారు. మత్తు పదార్థాల నిర్మూలనకు నిరంతరం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై జ్యోతి అన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాల విక్రయాలపై ప్రజలకు సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

### ఎమ్మెల్యే సంజయ్ కుమార్




ప్రజాపక్షం/జగిత్యాల : యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌తో కలిసి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది యోగా సాధనలో పాల్గొని యోగా ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే ,కలెక్టర్ మాట్లాడుతూ యోగాభ్యాసంతో ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని అన్నారు.యోగా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను కూడా అందిస్తుందని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు.ప్రపంచవ్యాప్తంగా యోగాకు లభిస్తున్న ఆదరణ భారతీయ సంస్కృతి గొప్పతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. నేటి ఒత్తిడితో కూడిన జీవనశైలిలో యోగా ఎంతో ఉపయుక్తమని, యువత ఆరోగ్య పరిరక్షణకు యోగాభ్యాసం ఎంతో దోహదపడుతుందని తెలిపారు.అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ వివిధ యోగా ఆసనాలు, ప్రాణాయామం సాధించారు. యోగా ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సుజాత, వాణి,తదితరులు ఉన్నారు.

**సిఎం సహాయ నిధి నిరుపేదలకు వరం:ఎమ్మెల్యే**

**జగిత్యాల టౌన్ :** సీఎం సహాయ పథకం నిరుపేదలకు వరమని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు.జగిత్యాల పట్టణం, అర్బన్ ,రూరల్ మండలానికి చెందిన 74 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన 19 లక్షల 40 వేల రూపాయల విలువైన చెక్కులనుబీ48 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేసి,చీర కానుకగా అందజేసారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూతెలంగాణ రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధి రెండు సమానంగా అమలు చేస్తున్నామన్నారు.కళ్యాణ లక్ష్మీ పథకం అమలు తో పెళ్లి చేసిన పేదింటి తల్లులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందన్నారు. జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రి లో కార్పోరేట్ స్థాయి వైద్యం అందుబాటులో ఉందని ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. రూ.60 కోట్ల నిధులు మంజూరు తో జగిత్యాల మెడికల్ కళాశాల పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు.ఈ కార్యక్రమంలో గజంగి నందయ్య,మున్సిపల్ చైర్మన్ వాణి శ్రీనివాస్, నారాయణ రెడ్డి, ఉన్నారు.

**పల్లె దవాఖానాతో ప్రజలకు మెరుగైన వైద్యం..**



**సారంగాపూర్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమంలో భాగంగా సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామంలో 20లక్షలతో నిర్మించచిన పల్లె దవాఖానాను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం గ్రామంలో 10లక్షలతో చేపట్టనున్న సిసి రోడ్ల పనులను ప్రారంభించడానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొలపాక రాధ రాజు, సింగిల్ విండో చైర్మన్ గురునాథం మల్లారెడ్డి, డిఎంహెచ్‌వో సుజాత, ఎంపిడివో నీరజ, ఉప సర్పంచ్ ప్రభాకర్, వార్డు సభ్యులు, సర్పంచులు ఆకుల రమేష్, ఎదుల శేఖర్, బాస మహేష్, అశ్విని రమేష్, సొల్లు సురేందర్, మ్యాకల శేఖర్, మాధవి బాపిరాజు, రుషేంద్ర శంకర్ రెడ్డి, గంగారాం, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, మండల గ్రామ నాయకులు కోల శ్రీనివాస్, శేఖర్ గౌడ్, రాజన్న, లక్ష్మ ణ్, మల్లేష్, నాంపల్లి, వైద్య సిబ్బంది, రెవెన్యూ అధికారులు, మహిళ సంఘాల సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## హమాలీల ఆందోళనకు సిపిఐ మద్దతు



ప్రజాపక్షం/పెద్దపల్లి:గోదావరిఖని కూరగాయల మార్కెట్‌లో పని చేస్తున్న హమాలీ లకు కూలీ రేట్లు పెంచాలని గత కొన్ని సంవత్సరాలుగా ఆందోళనలు చేసినప్పటికీని హోల్ సేల్ వ్యాపారులు కూలీ రేట్లు పెంచకుండా నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని, హోల్ సేల్ వ్యాపారులు మొండి వైఖరి ని విడనాడి తక్షణమే వారికి కూలీ రేట్లు పెంచాలని సిపిఐ రాష్ట్ర సమితి నాయకులు గౌతం గోవర్ధన్, నగర కార్యదర్శి కనకరాజు లు డిమాండ్ చేశారు. ఆదివారం గోదావరిఖని కూరగాయల మార్కెట్ లో అరగంట సేపు హమాలీ పని ని ఆపి నిరసన వ్యక్తం చేశారు.ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోసిక మోహన్, నగర సహాయ కార్యదర్శి తాళ్ళపెల్లి మల్లయ్య, కరీంనగర్ జిల్లా హమాలీ వర్కర్స్ యూనియన్ గోదావరిఖని మార్కెట్ కమిటీ అధ్యక్షులు ఎం ఎ గౌస్ తో పాటు నాయకులు కండె లక్ష్మయ్య, రాంచందర్, జానీ మియా,గాలి పెల్లి సతీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై బిఎల్‌ఎలకు అవగాహన

### టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు




ప్రజాపక్షం/ముత్తారం: పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ సార్ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల (బి ఎల్ ఎ) శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ శిక్షణ శిబిరంలో టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు ముఖ్య అతిథిగా పాల్గొని, పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. మంథని నియోజకవర్గం పరిధిలోని మంథని, కమాన్ పూర్,రామగిరి, ముత్తారం, పాలకుర్తి మండలాలకు సంబంధించిన బూత్ లెవెల్ ఏజెంట్లు ఈ శిక్షణ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుద్దిళ్ల శ్రీను బాబు మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ సార్ ప్రక్రియలో బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమైందని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, జాబితాలో తప్పులను సరిదిద్దేలా బిఎల్‌ఎలు క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుండి మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ మండలాల ముఖ్య ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**జయశంకర్‌సారుకు ఘననివాళి: టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు**

తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ ఆచార్య జయశంకర్ వర్ధంతి వేడుకలు మంథని పట్టణంలో ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, చేతులెత్తి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా దుద్దిళ్ల శ్రీను బాబు మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జయశంకర్ చేసిన త్యాగాలు, ఆయన ఉద్యమ స్ఫూర్తి ఎప్పటికీ మరువలేనివి. ఆశయ సాధన, తెలంగాణ ప్రజల హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు ఆయన. జయశంకర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు సగాలన్నారు. సమాజానికి, ముఖ్యంగా తెలంగాణ ఉద్యమానికి ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా శ్రీను బాబు గుర్తుచేసుకున్నారు.ఈ నివాళి కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, దుద్దిళ్ల అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## జయశంకర్ ఆశయాలను నెరవేర్చాలి: మాజీ మంత్రి జీవన్ రెడ్డి



ప్రజాపక్షం/జగిత్యాల టౌన్: ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను నెరవేర్చాలిసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని మాజీ మంత్రి, బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి పేర్కొన్నారు.జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి వేడుకలను బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.మాజీ మంత్రి జీవన్ రెడ్డి ,మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ పాల్గొని జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ జయశంకర్ ఉద్యమ స్ఫూర్తి ఒక విధంగా ఉద్యమానికి వారే మార్గదర్శకం అని చెప్పక తప్పదన్నారు.తొలితరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం నుండి మలిదశ ఉద్యమం వరకు కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధన కొరకు వారికి ఒక మార్గదర్శకుడిగా నిలిచారన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## సిద్దిపేటలో నీట్‌కు 127 మంది గైర్హాజరు

### పరీక్ష కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ హైమావతి



ప్రజాపక్షం/సిద్దిపేట: సిద్దిపేట జిల్లాలో నీట్ 2026 పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలమైదానంలో మధ్యాహ్నం 2 గంటల నుండి0సాయంత్రం 5.15 గంటల వరకు నిర్వహించారు. మొత్తం 939 అభ్యర్థులకు 812 అభ్యర్థులు పరీక్షకు హాజరుకాగా, 127 మంది గైర్హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ హైమావతి జిల్లా కేంద్రంలోని రెండు పరీక్ష కేంద్రాలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాలను సందర్శించి పరీక్ష నిర్వహణను పర్యావేక్షించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముందస్తు ప్రణాళికతో ప్రతిది నియామవళీ ప్రకారం నీట్ పరీక్షను జిల్లాలో విజయవంతంగా నిర్వహించటం జరిగిందన్నారు. రెండు పరీక్ష కేంద్రాల్లో నోడల్ అధికారులు, పకడ్బందీగా సిఆర్‌పిఎఫ్, పోలీసు సెక్యూరిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండ పరీక్ష విజయవంతంగా ముగిసిందని, పరీక్ష నిర్వహణలో పాల్గొన్న అధికారులకు అందరికి ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ అభినందనలు తెలిపారు.

## దేశ సుస్థిర పాలనకు మద్దతివ్వండి

### మేధావుల సదస్సులో కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు




ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ : 12 ఏళ్ల పాలనలో భారతదేశ గతినే మార్చేసిన మహనీయుడు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. ప్రధాని మోడీ 12 ఏళ్ల సుస్థిర పాలనను పురస్కరించుకొని కరీంనగర్ లోని ఈఎన్ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన మేధావుల సదస్సులో కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 ఏళ్ల మోడీ పాలన ఒక్క అవినీతికి తావులేకుండా సుస్థిరపాలనతో భారత్‌ను అగ్ర రాజ్యాల సరసన చేర్చి భారతదేశ గతినే మార్చేశారని అన్నారు. డిజిటల్ ఇండియా విషయంలో విప్లవం సృష్టించారన్నారు. సర్ పేరుతో ఓట్ల తొలగింపుపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. బంగ్లా, పాకిస్థాన్ నుంచి బెంగాల్‌కు అక్రమంగా వలస వచ్చిన ముస్లీం ఓట్లను తొలగిస్తే తప్పేంటని ప్రశ్నించారు. తెలంగాణలోనూ నిజమైన పౌరుడి ఓట్లను తొలగించే అవకాశమే లేదన్నారు. ముస్లీంలు సహా ప్రతి ఒక్కరూ తమ ఓటు ఉండేలా చూసుకోవాలని సూచించారు. అక్రమ చొరబాటుదారుల ఓట్లను దొంగ ఓట్లను ఖచ్చితంగా తొలగించాల్సిందేనని స్పష్టం చేశారు. చరిత్రలో ఎంతోమంది ప్రధానులు మారారు కానీ దేశ దశను మార్చిన నాయకుడు మోడీనే అని కాంగ్రెస్ పాలన కాలమంతా స్కాంలకే పరిమితమైందన్నారు. ప్రపంచ రాజకీయాల్లో కీలక శక్తిగా భారత్ ఎదిగిందని పేదరిక నిర్మూలన, డిజిటల్ ఇండియా, అవినీతి నియంత్రణ, ప్రపంచవేదికపై భారత గౌరవం జాతీయ భద్రత, ఆధునిక హైవేల నిర్మాణం, రైతు సంక్షేమం, మహిళా సాధికారత వంటి రంగాలన్నీ భారత దేశాన్ని ముందుంచారన్నారు. తెలంగాణకు కేంద్రం నుంచి వచ్చిన నిధుల గురించి రైల్వే, రోడ్డు, ఆసుపత్రుల అభివృద్ధి గురించి వివరించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ వై.సునీల్ రావు, కృష్ణారెడ్డి, బాస సత్య నారాయణ, రాజయ్య, శైలజ పాల్గొన్నారు.

## యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలి: సిపి



ప్రజాపక్షం/పెద్దపల్లి : నేటి జీవన విధానంలో మనిషి అనేక ఒత్తిళ్లకు గురవుతున్నాడని, యోగా ద్వారా వాటి నుంచి ఉపశమనం పొందవచ్చని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో పోలీస్ పరేడ్ మైదానంలో యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్, అధికారులు, సిబ్బందికి యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.యోగా అనేది ఒకరోజు నిర్వహించే కార్యక్రమం కాదని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాల్సిన ఆరోగ్య సాధనమని పేర్కొన్నారు.యోగా చేయడానికి ప్రత్యేకమైన పరికరాలు గానీ,ఇతరుల సహకారం గానీ అవసరం లేదని, వ్యక్తిగత నిబద్ధత, సంకల్పం ఉంటే సరిపోతుందని అన్నారు.ఆరోగ్యమే మహాభాగ్యమని, మంచి ఆరోగ్యం మనిషికి అత్యంత విలువైన ఆస్తి అని పేర్కొన్నారు. జీవితంలో ఎంతటి ఉన్నత స్థానాలు సాధించినా,ఎంతటి సంపద సంపాదించినా వాటిని ఆనందించడానికి ఆరోగ్యవంతమైన శరీరం అవసరమని తెలిపారు.అందుకే ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగా సాధన చేయడంతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచరులను కూడా యోగా చేయడానికి ప్రోత్సహించాలని సూచించారు.పోలీస్ సిబ్బంది సాధారణంగా శారీరక దృఢత్వానికి అధిక ప్రాధాన్యత ఇస్తారని, కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న యువ పోలీస్ సిబ్బందిని అభినందించారు. యువత తమ శారీరక,మానసిక ఆరోగ్యంపై మరింత శ్రద్ధ చూపాలని, ప్రస్తుతం అందరూ మంచి ఫిట్‌నెస్‌తో ఉన్నారని, భవిష్యత్తులో కూడా అదే స్థాయిని కొనసాగించాలని సూచించారు.యోగా ఒకరోజుతో పరిమితం కాకుండా నిత్య జీవితంలో భాగం కావాలని,యోగా దినోత్సవానికే పరిమితం చేయకుండా ప్రతి పదిహేను రోజులకు ఒకసారి శాఖల స్థాయిలో ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి సిబ్బందిలో అవగాహన పెంపొందించాలని అధికారులను ఆదేశించారు.యోగాతో ప్రశాంతమైన మనస్సు, ఆరోగ్యవంతమైన శరీరం లభిస్తాయని, మానసిక ప్రశాంతతకు,శారీరక దృఢత్వానికి యోగా ఉత్తమ సాధనమని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్,గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అఫ్జలోద్దీన్, రామగుండం సీఐ కృష్ణకుమార్,ఆర్ఐలు దామోదర్,మల్లేశం, శేఖర్,రమేష్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు,ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ యోగా శిక్షకురాలు రాధిక తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్య సంరక్షణ కోసం యోగా తప్పనిసరి

### ఎంపి రఘునందన్‌రావు



ప్రజాపక్షం/సిద్దిపేట: శరీరాన్ని ప్రేమిస్తూ నిత్య యవ్వనంగా ఉండాలంటే రోజు యోగా చేయాలని మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు సూచించారు. పని వత్తిడి మూలంగా చాల మంది ఉదయం త్వరగా లేచి ఏలాంటి శారీరక వ్యాయామాలు చేయటం లేదన్నారు. ఆరోగ్య సంరక్షణ కోసం తప్పనిసరిగా ఎంత పనివత్తిడి ఉన్న ఉదయం 5గంటలకు లేచి యోగా చేయాలన్నారు. స్ట్రాంగ్ మైండ్ ఇన్ స్ట్రాంగ్ బాడి అని ప్రఖ్యాత తత్వవేత్త అరిస్టాటిల్ ఎప్పుడో ఆరోగ్య సంరక్షణ కోసం చెప్పారన్నారు. ప్రతిరోజు యోగా చేస్తే వయస్సు పెరిగిన శరీరక ఉత్తేజాన్ని నిలుపుతుందన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆదివారం సిద్దిపేట జయశంకర్ స్టేడియంలో ఆయుష్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపి రఘునందన్‌రావు, జిల్లా కలెక్టర్ హైమావతిలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ముందుగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ కలకత్తాలో నిర్వహించిన యోగ కార్యక్రమంలో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించిన సందేశాన్ని స్క్రీన్‌పై ప్రదర్శించా రు. పిల్లలో కూడ తప్పనిసరిగా యోగా చేయించాలన్నారు. సెల్‌ఫోన్‌కు పిల్లలను దూరంగా ఉంచాలన్నారు. శరీర ఆకృతి బాగుంటే ఎదుటివారు మనపై పాజిటివ్‌గా ఉంటారని, నిత్యం యోగ చేస్తే ఆరోగ్యవంతమైన అలవాట్లను పా టిస్తూ ఉద్యోగులు రిటైర్డు అయిత తర్వాత కుటుంబంతో సంతోషంగా గడిపేలా ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ప్రధాని నరేంద్రమోదీ లాంటి రాజకీయ నాయకులు 75 ఏండ్లలో ఎంత స్ట్రాంగ్ ఉన్నారంటే నిత్యం యోగ, ఆరోగ్యవంతమైన సాత్విక ఆహారం తీసుకోవటం కారణమన్నారు. జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ రుషులు అందించిన భారతదేశ అతి ప్రాచీన ఆరోగ్య కార్యక్రమం యోగ అన్నారు. యోగ ప్రభావం, మనస్సు, శరీరం, ఆత్మను ఉత్తేజం చేస్తుందన్నారు. రోటిన్‌గా కాకుండ ఇష్టంగా యోగ అభ్యాసం చేయాలన్నారు. యోగతో పాటు సాత్వీకా ఆహారం తీసుకొని ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. ఈకార్యక్రమంలో యోగ డే నోడల్ అధికారి ఆయుష్ డాక్టర్ ఉమాదేవి, ఆర్టీఓ సదానందం తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి ఆరోపణలు

### మధ్యాహ్న భోజన సంఘం..
### అధ్యక్షుడు కుంటాల రాములు తొలగింపు



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్:** మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కుంటాల రాములును సంఘం నుండి శాశ్వతంగా తొలగించారు. ఎఐటీయుసి రాష్ట్ర, జిల్లా కమిటీల పిలుపు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా కమిటీ ప్రతినిధులు గాజంగుల రాజు ఆదివారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘంలో రాములు పలు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని కార్మికుల నుండి తీవ్రస్థాయిలో ఫిర్యాదులు వచ్చాయని, ఈ ఫిర్యాదులపై విచారణ జరిపిన ఏఐటీయూసీ రాష్ట్ర, జిల్లా కమిటీలు రాములను ఏఐటీయూసీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు మధ్యాహ్న భోజన కార్మిక సంఘం బాధ్యతల నుండి తక్షణమే తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇకపై డబ్బుల వ్యవహారాల్లో గానీ, కార్మిక సంఘం కార్యకలాపాల్లో గానీ కుంటాల రాములును ఎవరూ నమ్మవద్దని స్పష్టం చేశారు. ఆయనతో సంఘానికి ఎలాంటి సంబంధం లేదని, కార్మికులు ఆయనతో ఎలాంటి లావాదేవీలు పెట్టుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

## ప్రతీ పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు



**ప్రజాపక్షం/శివ్వంపేట :** పేదల సొంతింటి కల సహకారం చేయడంలో కాంగ్రెస్ సర్కార్ కీలకపాత్ర పోషిస్తుందని కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామంలో మధిర అశోక్, మధిర పెంటమ్మ రెండు కుటుంబాలకు చెందిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాన్ని పిఎసిఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డితో కలసి నూతన గృహప్రవేశాలను ప్రారంభించారు.బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ సర్కార్‌తోనే సాధ్యమని ప్రతీ పేద కుటుంబానికి సొంతింటి ల నెరవేర్చేందుకు ఎందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని అన్నారు.సర్పంచ్ హైమావతి ఆంజనేయులు, పూల్‌సింగ్, ఆంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షకు ఆలస్యంగా..
## వచ్చిన నలుగురు విద్యార్థులు

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లాలో నీట్ 2026 పరీక్ష 8 కేంద్రాల్లో నిర్వహించగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నియమ నిబంధనలననుసరించగా గిరిరాజ్ కళాశాల పరీక్ష కేంద్రానికి నలుగురు విద్యార్థులు ఆలస్యంగా రావటంతో లోపలికి అనుమతించలేదు. దీంతో వారు వెనుదిరిగారు. ఎంత బలిమిలాడిన లోనికి అనుమతించలేదు. గతంతో పోల్చుకుంటే ఈసారి అభ్యర్థుల సౌకర్యార్థం 15 నిమిషాలు అదనంగా సమయం కేటాయించారు. గతనెలలో 3 న నీట్ పరీక్ష జరిగినప్పటికీ పేపర్ లీక్ కావటంతో రద్దు కావటంతో ఈసారి పరీక్ష నిర్వహణ సంస్థ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ దీన్ని రద్దు చేసింది. కాగా ఆదివారం మరోసారి పరీక్ష నిర్వహించటంతో జిల్లా కేంద్రంలో నలుగురు విద్యార్థులు ఆలస్యంగా రావటం గమనార్హం. మరో విద్యార్థి బోధన్ సెంటర్‌లో పరీక్ష రాయల్సిండగా నిజామాబాద్‌కు వచ్చి పరీక్షకు హాజరు కాలేకపోయారు. పరీక్ష రాసే యువతులకు ఉన్న చెవిరికి కమ్మలు, మెడలో ఉన్న నెక్లెస్ చేతికి ఉన్న గాజులు ఉంటే పరీక్ష కేంద్రంలోకి అనుమతించలేదు.

## ఆదిలాబాద్‌లో..
## 'రక్ష న్యూరో హాస్పిటల్' ప్రారంభం



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్:** జిల్లా కేంద్రంలోని ద్వారకనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 'రక్ష న్యూరో హాస్పిటల్' ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు నాడీ, నరాల సమస్యలకు సంబంధించిన ప్రత్యేక ప్రైవేట్ ఆసుపత్రులు గానీ, సరైన వైద్య పరికరాలు గానీ అందుబాటులో లేకపోవడం వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో హైదరాబాద్, నాగపూర్, యావత్మాల్ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ఇప్పుడు ఆదిలాబాద్ హెడ్‌క్వార్టర్స్‌లోనే అత్యాధునిక వసతులతో ఇలాంటి న్యూరో ఆసుపత్రి అందుబాటులోకి రావడం శుభపరిణామమని కొనియాడారు. స్థానిక ప్రజలకు ఈ ఆసుపత్రి ద్వారా మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందుతాయని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ అధ్యక్షులు, అనుపమ మ్యాచింగ్ సెంటర్ ప్రతినిధి జవాజి మనోహర్, లక్ష్మి దయాగ్నోస్టిక్ సెంటర్ ప్రతినిధులు, ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ అరె సిద్ధార్థ, ఆయన తండ్రి, సోదరుడు, కుటుంబ సభ్యులతో పాటు పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

**ప్రజాపక్షం / ముథోల్ :** ముథోల్ మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యోగా గురువు కైలాస్ విద్యార్థులు, ఆచార్యులతో ప్రాణాయమం, ఆసనాలు, ధ్యానం చేయించారు. అష్టాంగ యోగా సూత్రాల గురించి, యోగా ప్రాముఖ్యత గురించి ప్రధానాచార్యులు తెలియజేశారు. నేటి తరుణంలో ప్రపంచం అంతటా యోగా విశిష్టత, ప్రాముఖ్యతను తెలుసుకోవడమే కాకుండా దానిని నిజ జీవితంలో ఆచరిస్తున్నారని స్పష్టం చేశారు. చోగాను మన భారతీయ ప్రజలు గుర్తించి దానిని తమ జీవితంలో కూడా ఆచరించినట్లయితే జీవిత కాలం సుఖ సంతోషాలతో ఉంటారని పేర్కొన్నారు. ప్రబంధకారిణీ సభ్యులు, ఆచార్యులు సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం

### మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**ప్రజాపక్షం/మెదక్ :** యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. ఆరోగ్యవంతమైన వృద్ధాప్యం కోసం యోగ అనే అంశంతో నిర్వహించిన 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆదివారం మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియం ప్రాంగణంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, ఆర్డీఓ రమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భూక్య జ్ఞానేశ్వర్, డీసీహెచ్ డాక్టర్ శివదయాల్, ఆయుష్ విభాగం అధికారి మోహన్ రెడ్డి, జిల్లా యువజన క్రీడల అధికారి మోహన్ రెడ్డి, జిల్లా యువజన క్రీడల అధికారి రమేష్, ప్రముఖ యోగా గురువు ఆకుల రవి తదితరులు హాజరయ్యారు. కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రతిమా సింగ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్, అదనపు కలెక్టర్, ఆర్డీ ఓ స్వయంగా యోగా ఆసనాలు చేస్తూ పాల్గొన్నారు. యోగా గురువు ఆకుల రవి ఆధ్వర్యంలో అధికారులు, విద్యార్థులు, క్రీడాకారులు వివిధ యోగా ఆసనాలు అభ్యసించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగ అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, క్రమశిక్షణతో కూడిన జీవన విధానమని పేర్కొన్నారు. మన నవశక్తులన్నింటినీ ఏకం చేసి ఏకాగ్రతను పెంపొందించే శక్తి యోగాకే సాధ్యమని అన్నారు. భారతదేశం ప్రపంచానికి అందించన గొప్ప సంపద యోగా అని పేర్కొంటూ, వయో లింగ భేదం లేకుడా ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం యోగా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు, క్రీడాకారులు, యోగా సాధకులతో కలిసి కలెక్టర్ ఫోటో సెషన్‌లో పాల్గొన్నారు. తహసీల్దార్ లక్ష్మ ణ్ బాబు, యోగా ఇన్‌స్ట్రక్టర్ దేవేందర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, జిల్లా మండల స్థాయి అధికారులు, వైద్య సి బ్బంది, విద్యార్థులు, యువత, మహిళలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యోగా సాధకులు, ప్రజలు పాల్గొన్నారు.



## జర్నలిస్ట్ భూమయ్యకు..
## మంత్రి దామోదర్ పరామర్శ



**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** మెదక్ జిల్లా,అల్లాదుర్గం మండల వార్త దినపత్రిక సీనియర్ జర్నలిస్ట్, కే.భూమయ్య గత కొద్ది రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ కు గురై హైద్రాబాద్ లోని బోయిన్ పల్లిలో హెకా రిహబ్ హాస్పిటల్ లో చేరారు. తెలుసుకున్న రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహా ఆదివారం ఉదయం ఆసుపత్రికి చేరుకొని భూమయ్యను పరామర్శించి ఆయనకు మనోధైర్యాన్ని కల్పించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. ప్రతిరోజు నివేదిక ఇవ్వాలన్నారు.ధైర్యం కోల్పోవద్దని అన్నివిధాలుగా తాను అండగా ఉంటానని మంత్రి భరోసా ఇచ్చారు.మెదక్ జిల్లా టియూడబ్ల్యుజె అధ్యక్షులు శంకర్ దయాళ్ చారి, ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్ ఉన్నారు.

# పేదల సొంతింటి కలను ప్రభుత్వం సాకారం

### ఎమ్మెల్యే రోహిత్ రావు

**ప్రజాపక్షం/పాపన్నపేట:** పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ప్రతి అర్హత కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేస్తోందని మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు అన్నారు. మండల పరిధిలోని అబ్లాపూర్ గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఆదివారం ఆయన ప్రారంభించి లబ్ధిదారులతో ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ రోహిత్ రావు మాట్లాడుతూ, ఇల్లు అనేది కేవలం నాలుగు గోడలు కాదని, ఒక కుటుంబానికి భద్రత, ఆత్మవిశ్వాసం, భవిష్యత్‌కు భరోసా కల్పించే ఆస్తి అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకొని అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అందులో భాగంగానే ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన పేదలకు పక్కా ఇళ్లు అందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతోందని తెలిపారు. అబ్లాపూర్ గ్రామంలో ప్రారంభించిన ఈ ఇంటి ద్వారా లబ్ధిదారుల కుటుంబంలో కొత్త ఆశలు చిగురించాయని, ప్రతి కుటుంబం సంతోషంగా జీవించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాల కల్పన, పేదల సంక్షేమం విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు వెంకటేశం, మండల పార్టీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, ,సీనియర్ నాయకులు ప్రశాంత్ రెడ్డి, డిసిసి అధికార ప్రతినిధి శ్రీకాంత్ అప్ప, సర్పంచులు శ్రీనివాస్, ఏసు, శ్రీధర్, యాదగిరి, శేఖర్, నాయకులు భూమయ్య, సతీష్,ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు శ్రీశైలం, శివయ్య, కిష్టయ్య , అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# ఇబ్బందులు లేకుండా 'నీట్' నిర్వహించాం

### పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) ప్రశంతంగా ముగిసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. పరీక్షల నిర్వహణను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి ఏర్పాట్లను పరిశీలించారు. నీట్ పరీక్షల నిర్వహణ సందర్భంగా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఆర్డీఓ రమాదేవి, తహసీల్దార్ లక్ష్మ ణ్ బాబు, డీఎస్పీ ప్రసన్న కుమార్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ తదితర అధికారులతో కలిసి కలెక్టర్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీట్ పరీక్షలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు ముందస్తుగా వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి తగిన సూచనలు, సలహాలు అందించినట్లు తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రం వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు, అభ్యర్థులను ప్రవేశ ద్వారం వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే లోపలికి అనుమతించినట్లు వెల్లడించారు. పరీక్షా కేంద్రం పరిసరాల్లో పోలీసు శాఖ 163 బీఎన్ఎస్ చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేసి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 481 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 423 మంది హాజరయ్యారని 58 మంది వివిధ కారణాలతో గైర్హాజరయ్యారని కలెక్టర్ వెల్లడించారు. మొత్తం మీద జిల్లాలో నీట్ పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా నిర్వహించబడినట్లు ఆమె తెలిపారు.



## నగరపాలక సంస్థలో సంపూర్ణ స్పెషల్‌డ్రైవ్

### కమిషనర్ దిలీప్ కుమార్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నగరంలో పారిశుధ్య పరిస్థితులను చక్కదిద్దేందుకు వీలుగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చేపటిన స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమం విజయవంతంగా పూర్తయిందని నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ తెలిపారు.10 నుండి స్పెషల్‌డ్రైవ్‌ను ప్రారంభించామని, రెండు నుండి మూడు డివిజన్లలో విస్తృతస్థాయిలో పారిశుధ్య పనులను చేపట్టి పూర్తి చేశామన్నారు. ఐదు జోన్ల పరిధిలో దాదాపు 23 కిలోమీటర్ల పొడవున కూడిన స్టామ్ వాటర్ డ్రైనేజీలుండగా రూ.68.96 లక్షల అంచనా వ్యయంతో డీసిల్టింగ్ పనులు కొనసాగుతున్నాయని, ఇప్పటికే 17.22 కిలోమీటర్ల పొడవుతో కూడిన డ్రైనేజీల డీసిల్టింగ్ పూర్తయిందని వివరించారు. డీసిల్టింగ్ పనులను కూడా పది రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు.

## భారత్ ప్రపంచానికి అందించిన సంపదల్లో యోగా ఒకటి

### అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** భారతదేశం ప్రపంచానికి అందించిన విజ్ఞాన సంపదలలో యోగ ఒకటని, యోగ కేవలం వ్యాయామం కాదని, జీవితం ఎలా గడపాలో నేర్పే విజ్ఞానం అని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. ఆదివారం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.యోగాతో కేవలం ఆరోగ్య ప్రయోజనాలే కాకుండా మనిషి వ్యక్తిత్వం, ఆలోచన విధానం, సమాజం, ప్రకృతి మధ్య ఉన్న అనుబంధాన్ని కూడా బలపరుస్తుందన్నారు. మనిషి శరీరం, మనసు, ఆత్మ మధ్య సమన్వయాన్ని సాధించడమే యోగా అసలు లక్ష్యమని పేర్కొన్నారు. మనిషి సాంకేతికంగా ఎంతో అభివృద్ధి సాధించినప్పటికి మానసిక ప్రశాంతతను కోల్పోతున్నాడని, ఒత్తిడి, ఆందోళన పెరుగుతున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో యోగా ఔషదంలా పనిచేస్తుందన్నారు.ఆయుష్ శాఖ ఆఫీసర్ గంగాదాస్, మేరా యువ భారత్ సమన్వయ కర్త రమేష్, డివైఎస్ఓ పవన్ కుమార్, యోగా గురువులు ప్రభాకర్, సిద్దిరాములు, రామచందర్‌రావు పాల్గొన్నారు.

## ప్రేమ వ్యవహారంలో యువకుడి హత్య

### 48గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు

**ప్రజాపక్షం/ఆదిలాబాద్:** ప్రేమ వ్యవహారంలో అడ్డుగా ఉన్నాడనే కక్షతో ఓ యువకుడిని దారుణంగా హత్య చేసిన ఉదంతాన్ని నేరడిగొండ పోలీసులు 48 గంటల్లోనే ఛేదించారు. ఈ దారుణానికి పాల్పడిన ఆరుగురు నిందితులను అ రెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుండి మొబైల్ ఫోన్లు, ద్విచక్ర వాహనాలు, బీరు సీసాలను స్వా ధీనం చేసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఈ కేసు వివరాలను వెల్లడించారు. నేరడిగొండ మండలం పెద్ద బుగ్గారం గ్రామానికి చెందిన నాతరి సతీష్(23) జూన్ 17న కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మొదట నేరడిగొండ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. జూన్ 19న కరాత్‌వాడ చెరువులో సతీష్ శవమై తేలడంతో కేసును హత్య కేసుగా మార్చి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల దర్యాప్తులో ప్రేమ వ్యవహారమే ఈ హత్యకు కారణమని వెలుగులోకి వచ్చింది. ప్రధాన నిందితుడు ఎ1 షేక్ సుమేర్(24) తన ప్రేమకు అడ్డు వస్తున్నాడనే కక్షతో సతీష్‌ను హతమార్చాలని పథకం వేశాడు. ఇందులో భాగంగా తన స్నేహితులైన ఎ2 గగాధరి సాయికృష్ణ(23), ఏ3 బొజ్జ విష్ణువర్ధన్(22), ఏ4 షేక్ అక్రమ్(22), ఏ5 అబ్దుల్ నెహెఫ్(19),ఏ6 సయ్యద్ నోమాన్(19)ల సహాయం తీసుకున్నాడు. వీరంతా కలి సి మద్యం పార్టీ పేరుతో సతీష్‌ను కరాత్‌వాడ చెరువు వద్దకు పిలిపించారు. అక్కడ సతీష్‌తో బలవంతంగా ఎక్కువ మద్యం తాగించి, ఆపై గొంతు నులిమి దారుణంగా హత్య చేశారు. అనంతరం ఆధారాలు దొరకకుండా శవాన్ని చెరువులో పడేశారు. మృతుడి బైక్‌ను ఆదిలాబాద్‌కు తరలించి, మొబైల్ ఫోన్‌ను వెళ్తున్న రైలులో పడేశారు.




### ఆరుగురు నిందితుల అరెస్ట్..

### ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు

సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలు, ప్రత్యేక బృందాల సహాయంతో గాలించి పోలీసులు ఆరుగురు నిందితులను అదుపులోకీ తీసుకున్నారు. నిందితుల నుండి 5 మొబైల్ ఫోన్లు, నేరానికి ఉపయోగించిన 2 ద్విచక్ర వాహనాలు, మృతుడి బైక్, సంఘటనా స్థలంలో లభించిన 7 ఖాళీ బీరు సీసాలను స్వాధీనం చేసుకున్నారు. మృతుడు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అని తెలిసి నేరానికి పాల్పడినందున నిందితులపై భారతీయ న్యాయ సంహిత(బిఎన్ఎస్) సెక్షన్లతో పాటు ఎస్సీ, ఎస్టీ (దౌర్జన్యాల నిరోధక) చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు. కేసును వేగంగా ఛేధించిన పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు.

# గంజాల్ టోల్ ప్లాజా వద్ద రవాణా శాఖ స్పెషల్ డ్రైవ్

### 11 బస్సులు , రెండు గూడ్స్ వాహనాల సీజ్
### నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు
### ఎంవిఐ దూప్ సింగ్, తిరుపతి




**ప్రజాపక్షం/సోన్ :** మండల పరిధిలోని గం జాల్ టోల్ ప్లాజా కేంద్రంగా రవాణా శాఖ అధికారులు ఆదివారం భారీ తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా, పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న కాంట్రాక్ట్ క్యారేజ్ (సిసి) బస్సులు అలాగే సామర్థ్యానికి మించి లోడ్‌తో నడుస్తున్న గూడ్స్ వాహనాలే లక్ష్యంగా ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నిర్మల్ జిల్లా రవాణా అధికారి సిబ్బందితో కలిసి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు , దూప్‌సింగ్, తిరుపతి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, అక్షయ్, రజనీకాంత్, అసీఫ్‌లు ఈ తనిఖీల్లో స్వయ ంగా పాల్గొన్నారు. గంజాల్ టోల్ ప్లాజా గుండా వెళ్తున్న ప్రతీ ప్రైవేటు బస్సు సరుకు రవాణా వా హనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రయాణీకుల ప్రాణాలతో చెలగాటమాడితే సహించేది లే దనీ, ఈ తనిఖీల్లో భాగంగా ఫిట్‌నెస్ సర్టిఫికేట్లు తేలకపోవడం, పర్మిట్ నిబంధనలు ఉల్లంఘించడం, సీటింగ్ సామర్థానికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న 11 కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులను అధికారులు గుర్తించి, అక్కడిక్కడే సీజ్ చేశారు. వీటితో పాటు అనుమతించిన బరువు కంటే అదనపు లోడ్‌తో రహదారులపై ప్రయాణిస్తూ ఇతర వాహనదారులకు ముప్పుగా పరిణమించిన రెండు గూడ్స్ రవాణా వాహనాలను సైతం స్వాదీనం చేసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఉల్లంఘనలకు పాల్పడిన ఈ వాహనాలపై భారీగా జరిమానాలు విధించనున్నట్లు సమాచారం నిరంతర నిఘా ఉంటుంది. అధికారులు మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు దూప్‌సింగ్, తిరుపతి సంయుక్తంగా మాట్లాడుతూ, నిబందనలు అతిక్రమించి నడిపే వాహనాల వల్లనే జాతీయ రహదారులపై ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక లాభాల కోసం ప్రయాణికుల భద్రతను గాలికొదిలేసి, బస్సుల్లో ఓవర్‌లోడింగ్‌కు పాల్పడే ప్రై వేటు ట్రావెల్స్ నిర్వాహకులను ఎంతమా త్రం ఉపేక్షించబోమని హెచ్చరించారు. సరుకు ర వాణా వాహనదారులు సైతం నిర్దేశిత పరిమితి మేరకే లోడ్‌ను రవాణా చేయాలని అంతకంటే ఎక్కువ బరువుతో వెళ్తే వాహనాల నియంత్రణ కోల్పోయి ఘోర ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని స్పష్టం చేశారు. ప్రతీ వాహనానికి సంబంధించిన పన్నులు, పర్మిట్లు, ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ వంటి అన్ని రకాల పత్రాలు పక్కాగా ఉండాలని లేని పక్షంలో మోటార్ వా హనాల చట్టం ప్రకారం కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఇలాంటి ముమ్మర తనిఖీలు కొనసాగుతాయని రవాణ శాఖ అధికారులు వెల్లడించారు.

## సైబర్ క్రైమ్ రికవరీలో..
## రాష్ట్రస్థాయిలో 'నిజామాబాద్ జిల్లా'

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** జాతీయ లోక్ అదాలత్ లో సైబర్ క్రైమ్‌ల పరిష్కారంలో నిజామాబాద్ జిల్లా రాష్ట్రస్తాయిలో ప్రముఖ స్థానంలో నిలిచి, 165 సైబర్ క్రైమ్ కేసులలో 41,81,48800 రూపాయల రికవరీని సాధించుటలో విజయం సాధించుటకు పనిచేసిన అధికారులను, సిబ్బందిని నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్య అభినందించారు. జూన్ 20 శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా వివిధ 5458 కేసులలో రాజీపడి పరిస్కరించబడడం అధికారుల పనితీరుకు నిదర్శనమన్నారు. క్షణికావేశంలో చేసే తప్పులను సరిదిద్దుకోవడానికి లోక్ అదాలత్ అనేది ఒక మంచి అవకాశమని, అనవసర గొడవలకు పోయి జీవితాలను ఇబ్బందుల పాలు చేసుకోకూడదని అన్నారు. రాజీ మార్గమే రాజా మార్గమని, రాజీ కుదుర్చుకోవడానికి అవకాశమున్న అన్ని కేసులల్లో ఇరువర్గాలు రాజీపడవచ్చన్నారు. ముఖ్యంగా సైబర్ బాధితులకు సత్వర న్యాయం చేయాలని, టిఎస్‌సిఎస్‌బి (తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటి బ్యూరో) డైరెక్టర్ శిఖాగోయల్ నిరంతర పర్యవేక్షణ అద్భుత ఫలితాలను రాష్ట్రస్తాయిలో నిలిచిందన్నారు. 165 సైబర్ కేసులలో సైబర్ నేరుగాళ్ల చేతిలో కోల్పోయిన 41,81,48800 రూపాయలను తిరిగి సైబర్ బాధితులకు అందజేయబడ్డాయన్నారు. గత నెలరోజుల నుండి జూన్ 20 వరకు జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన, రాజీ పడటానికి అవకాశం ఉన్నటువంటి, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఐపిసి అండ్ బిఎన్ఎస్ అండ్ ఎస్ఎల్ఎల్ 760 కేసులు, సైబర్ క్రైమ్ 165 కేసులు, ఇ పెట్టి 2358 కేసులు, డిడి అండ్ ఎం.వి. యాక్ట్ 2193 కేసులు మొత్తం 5458 కేసులలో ఇరువర్గాలను రాజీ కుదిరించడం జరిగిందన్నారు. జిల్లా ప్రజలెవరైనా సైబర్ మోసాలకు గురయినట్లయితే వెంటనే 1930 కి కాల్ చేసి గాని http://cybercrime.gov.in పోర్టల్ లో లాగిన్ అయి దరఖాస్తు చేయవచ్చన్నారు. ఈ సందర్భంగా జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేసిన సిసిఆర్‌బి, కోర్టు డ్యూటి, సైబర్ సెల్ సిబ్బందిని పోలీసు కమిషనర్ అభినందించారు.

## ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదు

కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఆరోగ్యానికి మించిన ఆస్తిలేదని అది యోగాతోనే సాధ్యమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. ఆదివారం స్థానిక సర్దార్ పటేల్ స్టేడియంలో ఆయుష్, క్రీడ శాఖల అధ్వర్యంలో నిర్వహించిన అంత ర్జాతీయ యో గా దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యోగా ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో ఒక భాగం కావాలన్నారు. ఆరోగ్యంతో అంద మైన జీవితం సాధ్యమన్నారు. దీనికి యోగానే కీలకమన్నారు. యోగా అనేది కేవలం వ్యాయా మం మాత్రమే కాదని శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను, క్రమశిక్షణను ఎంతో దోహదం చేస్తుందన్నారు. గతంలో యో గా ది నోత్సవం రోజు కేవలం ఆయుష్ శాఖ వారు మాత్రమే పాల్గొనే వారని, నేడు ప్రజలు భారీసంఖ్యలో హాజరుకావటం శుభసూచికం అన్నా రు. యోగాను జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యవంతమైన సమా జాన్ని నిర్మాణానికి కృషిచేయాలని సూచించారు. మారుతున్న కాలంలో ఆహారపు అలవాట్లు, సాంకేతిక సౌకర్యాలతో మ నిషి శ్రమకు దూరమై అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నాడని అన్నారు. ప్రతి మనిషికి అ త్యంత విలువైన ఆస్తి ఆరోగ్యమని అది సరిగాలేకపోతే ఎంత సాధించినా దానిని పూర్తిగా అస్వాదించలేమని పేర్కొన్నారు. ఆరోగ్యంగా ఉండటమే ప్రతివ్యక్తి జీవితానికి బలమైన పునాది అని కలెక్టర్ అన్నారు. కార్యక్రమానికి తొలుత ఆయన అందరితో కలిసి ఆసనాలు, సూర్యనమస్కారాలు వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీ డల అభివృద్ధి అధికారి సునిల్‌రెడ్డి, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్, జిల్లా ఇంటర్‌మీడియట్ అధికారి రవిబాబు, ఉప వైద్యా ధికారి డాక్టర్ వేణుమాదవ్, నోడల్ అధికారిణి డాక్టర్ పద్మావతి, నేచురో పతి వైద్యురాలు కనకమహాలక్ష్మి , యోగా సాధకులు, ప్రజలు పాల్గొన్నారు.

## సన్నబియ్యం అక్రమ వ్యాపారం చేస్తే కఠిన చర్యలు: ఎస్ఐ హరిత

ప్రజాపక్షం/కల్లూరుః చౌక ధరల దుకాణాల ద్వారా ప్రభుత్వ సరఫరా చేస్తున్న సన్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి, నిల్వ ఉంచి బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్న రేషన్ డీలర్లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తర లించినట్లు కల్లూరు ఎస్ఐ హరిత తెలిపారు. ఏప్రిల్ 24, 25 తేదీలలో సత్తు పల్లి సివిల్ సప్లై చెకింగ్ ఇన్‌స్పెక్టర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ టీం ఒఎ స్‌డి ఆధ్వర్యంలో కల్లూరు మండలం పేరవంచలో గల ఎఫ్ పి షాప్ నెంబర్ 2232015, కల్లూరు మండలం ఖాన్ ఖాన్ పేట ఎఫ్‌పి షాప్ నెంబర్ 2232005 లలో జాయింట్ తనిఖీలు చేయగా ఎఫ్‌పి షాప్ నెంబర్ 2232015లో స్టాక్ రిజిస్టర్‌లో ఉండవలసిన దాని కన్నా 12.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం, అదేవిదంగా ఎఫ్‌పి షాప్ నెంబర్ 2232005లో 64.01 క్వింటాళ్ల రేషన్ బియ్యం అదనంగా ఉన్నట్లు గుర్తించారు. రేషన్ డీలర్లను విచారించగా ఇరువురు అవకతవకలకు పాల్పడి, ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్న రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ రేషన్ కార్డు దారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్కు రీసైకిల్ చేస్తున్నట్లుగా గుర్తించి రేషన్ షాప్ డీలర్ రాయల నాగే శ్వరరావుపై చీటింగ్, నమ్మకద్రోహం సెక్షన్ల కింద సివిల్ సప్లై అధికారి వేముల నరేష్ ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశామన్నారు. ఆయా కేసులలో ఇద్దరిని అరెస్ట్ చేసి సత్తుపల్లి జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా ఇరువురికి జులై 3 వరకు జుడీషియల్ రిమాండ్ విధించారని తెలిపారు. కల్లూరు మండలంలో ఎవరైనా రేషన్ డీలర్లు లేదా బియ్యం వ్యాపారస్తులు పేద ప్రజల కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్నబియాన్ని అక్రమంగా నిల్వ చేస్తూ వ్యాపారం నిర్వహిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబడుతాయని హెచ్చరించారు.

## ఇసుక అక్రమ రవాణా టిప్పర్ పట్టివేత


**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండలం పెద్ద కోరుకొండిలో ఆదివారం అక్రమంగా అనుమతి లేకుండా ఆంధ్రా నుంచి తెలంగాణకు ఇసుకను తర లిస్తున్న ఆదివారం టిప్పర్‌ను స్వాధీన పరుచుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ హరిత తెలిపారు. సమాచారం మేరకు ఆంధ్రాలో ఉయ్యూరు ఇసుక లోడుతో వస్తున్న కల్లూరు మండలం పెద్ద కోరుకొండి వద్ద డ్రైవర్ గిరిరాజు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## సరిగా చేస్తే ప్రతీ ఆసనం శక్తి ప్రక్రియే



**ప్రజాపక్షం/కూసుమంచిః** సరిగా చేస్తే ప్రతీ ఆసనం శక్తి ప్రక్రియే అని, యోగా రోజువారీ జీవన విధానం లో ఓ దినచర్య గా మార్చుకుంటే ఆరోగ్య జీవితం సాగించొచ్చని జిహెచ్‌డిపి హెచ్.సి. కూసుమంచి వైద్యులు పి.జ్యోతి, సాయి కుమార్, లోహిత పేర్కొన్నారు. ఆదివారం పాలేరులోని నవోదయ విద్యాలయం లో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగ శిక్షకురాలు మాధవి యోగా ఆసనాల ప్రాముఖ్యతలు వివరించారు. వైద్య సిబ్బందికి, అధ్యాపకులు, ఉపాధ్యాయులతో యోగా చేయించారు. యోగాను ప్రతీ రోజూ చేసినట్లయితే దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు సైతం అదుపులో ఉంచుకోవచ్చని సూచించారు. 12వ అంతర్జాతీయ యోగా దినో త్సవం సందర్భంగా ఈ నెల 12 నుంచి 21 వరకు ఆయుష్ శాఖ ఆధ్వ ర్యంలో యోగా పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే.శ్రీనివాసులు, అధ్యాపక బృందం, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


## మట్టిగడ్డను తీర్చిదిద్దిన ముద్దుబిడ్డ ప్రొ.జయశంకర్



**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** మట్టిగడ్డను తీర్చిన ముద్దుబిడ్డ ఆచార్య జయశంకర్ అని జిల్లా పరి షత్ మాజీ చైర్మన్, మధిర నియోజ కవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంఛార్జి లింగాల కమల్‌రాజు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆది వారం ఘనంగా నిర్వహించారు. ఆచార్య జయశంకర్ జీవితం, పోరాటం, త్యాగం నేటి తరాలు స్ఫూర్తిగా తీసుకోవాలని, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై సమర శంఖం పూరించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మేజర్ సొసైటీ అధ్యక్షుడు బీ.కృష్ణప్రసాద్, బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ వై.వి.అప్పారావు, నాయకులు ఆర్.శ్రీనివాస రావు, పీ.వెంకటేశ్వరరావు, సీ.హెచ్.నాగేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు కె.రాఘవరావు, ఎస్.డీ.ఇక్బాల్, పీ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం–జగ్గయ్యపేట రోడ్డును జాతీయ రహదారిగా ప్రకటించాలి

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని
కేంద్ర, రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ
మంత్రులకు లేఖలు సమర్పణ



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్త గూడెం నుండి తల్లాడ మీదుగా జగ్గయ్యపేట వరకు ఉన్న రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించి అభివృద్ధి చేయడం ఎంతో అవసర మని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనం నేని సాంబశివరావు అన్నారు. ఈ మేరకు న్యూఢిల్లీలో రోడ్డు రవాణా, హైవేస్ కేంద్ర మంత్రి నితిన్ జైరాం గడ్కరి, రాష్ట్ర రాజధానిలో రోడ్లు భవనాల శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డికి ఆయన లేఖలు సమర్పించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు వంద కిలోమీటర్ల పొడవు కలిగి, కొత్తగూడెం (ఎన్ హెచ్30) వైరా జగ్గయ్యపేట (ఎన్‌హెచ్ 65)లను అనుసంధానించే ఈ రహ దారి తెలంగాణలోని ప్రధాన పారిశ్రా మిక, వాణిజ్య, వ్యవసాయ మరియు గిరిజన ప్రాంతాలను కలిపే వ్యూహా త్మక ప్రాధాన్యత కలిగిన రాష్ట్ర రహ దారి అని వివరించారు. భద్రాద్రి కొత్త గూడెం జిల్లా కేంద్రంలో సింగరేణి, కెటిపి ఎస్, నవభారత్, బిటిపిఎస్, హెవీ వాటర్ ప్లాంట్ లాంటి అనేక ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు ఉండటం వల్ల ఇది ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా ఉందన్నారు. ఈ రోడ్డు పాల్వంచ, అశ్వాపురం, మణుగూరు లాంటి పారిశ్రామిక ప్రాంతాలను కలపడమే కాకుండా, అంతర్రా ష్ట్రీయ పుణ్యక్షేత్రమైన భద్రాచలం చేరుకోవ డానికి భక్తుల మార్గాన్ని సులభతరం చేస్తుందని పేర్కొన్నారు. దీనిని జాతీయ రహదారిగా మార్చడం వల్ల తూర్పు, మధ్య తెలంగాణ, మధ్య తెలంగాణ మధ్య రవాణా మెరుగై, బొగ్గు రవాణా సులభతర మవుతుందని, గ్రామీణ ప్రాంతాల సామాజిక ఆర్థిక అభివృద్ధికి తోడ్పడు తుందని తెలిపారు. జగ్గయ్యపేట వద్ద ఎన్ హెచ్ 65 కి అనుసంధానం కావడం ద్వారా ప్రధాన మార్కెట్లకు లింక్ ఏర్పడుతుందని, ప్రాధాన్యత ప్రాతిపదికన ఈ నవీకరణ పనులను చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర మంత్రులకు ఆయన సమర్పించిన లేఖలో పేర్కొన్నారు.

## 23న కలెక్టరేట్ ముట్టడి

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్:** ఈనెల 23న వ్యవసాయ కార్మిక సంఘం నిర్వ హించ తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. ఏదులాపురం పురపా లక పరిధిలోని ఒకటోవార్డులో ఎంఎన్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం పెండ్లి నర్సిరెడ్డి అధ్యక్షతన మండల సమితి సమావేశంలో మాట్లాడారు. కేంద్రప్ర భుత్వం ఉపాధి హామీ పథకంలో మార్పులు తీసుకురావడం వల్ల గ్రామీణ కార్మి కుల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని, కలెక్టర్ ముట్ట డిలో పార్టీ శ్రేణులు, కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నియంత్రణ కమిషన్ చైర్మన్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేశ్, రాష్ట్ర సమితి సభ్యుడు కర్ణకుమార్, జిల్లా కార్య వర్గసభ్యులు చిన్న వెంకటరెడ్డి, అజ్మీరా రామ్మూర్తి, జిల్లా సమితి సభ్యులు రంగా రావు, వెంకటనారాయణ, శంకరయ్య, చంద్రరావు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పేదల హక్కు

బికెఎంయు ఖమ్మం జిల్లా
ఆర్గనైజింగ్ కార్యదర్శి దండు ఆదినారాయణ



**ప్రజాపక్షం/సత్తుపల్లిః** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కమ్యూనిస్టు పార్టీ పోరాటంతో పేదలు సాధిం చుకున్న హక్కు అని, దాన్ని కాపాడుకునేందుకు ఐక్యంగా పోరాడాలని, 23వ తేదీ ఖమ్మంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికెఎంయు ఖమ్మం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి దండు ఆదినారాయణ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని చెరుకుపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు బిజెపి ప్రభుత్వం విబి–జి రామ్ జి పథకం తెచ్చిందని, ఇది పేదల పొట్ట కొట్టేందుకేనని ఆయన విమర్శించారు. ఉపాధి హామీ పథకంలో 200 రోజులు పనులు కల్పించాలని, రూ. 700 కూలీ ఇవ్వాలని, ఉపాధి హామీకి నిధులు పెంచి కేటాయించా లని విబి–జి రాంజీ పథకాన్ని రద్దు చేయాలని దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళన జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం బికెఎంయు మండల కార్యదర్శి తాటి వీరభద్రం, తాటి రాజులు, తాటి కుమారి, తారబోయిన రాజు, రాజమ్మ, రాధ, రత్తమ్మ, సుజాత, గడ్డం, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరు కోర్టులో అంతర్జాతీయ యోగా దినోత్సవం



**ప్రజాపక్షం/మణుగూరుః** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మణుగూరు ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో ఆదివారం యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీస్ శాఖ అధికారులు ఉత్సా హంగా పాల్గొన్నారు. సీనియర్ న్యాయవాది కంది మల్ల నరసింహారావు వివిధ యోగాసనాలను ప్రద ర్శిస్తూ వాటి ఆరోగ్యపరమైన ప్రయోజనాలను వి వరించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ కంబపు సూర్యరెడ్డి మాట్లాడుతూ యోగా అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదు, మానసిక ప్రశాంతతను కలిగించే సమగ్ర జీవన విధానమ న్నారు. నేటి వేగవంతమైన జీవితంలో ఒత్తిడి, ఆందోళనలను అధిగమించేందుకు యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ రోజు వారీ జీవితంలో కొంత సమయాన్ని యోగాకు కేటాయిస్తే ఆరోగ్యంతో పాటు పనితీరులోనూ మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్ర మంలో మణుగూరు సిఐ పాటి నాగబాబు, ఎస్ ఐ నగేష్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుకృష్ణ, కార్యదర్శి కామాసాని మధు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యురాలు, న్యాయవాది వీరంకి పద్మావతి, న్యాయవాదులు విజయ్, బద్దం శ్రీనివా సరెడ్డి, చిర్ర రవి, నగేష్ కుమార్, అంకం సర్వేశ్వ రరావు, నాగార్జున రెడ్డి, రామ్మోహన్ రావు, వాసవి, ఎం.ఎల్.ఎస్.సి కో ఆర్డినేటర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ‘సేవ్ మణుగూరు’ పేరిట జరుగు దీక్షలకు మద్దతు

సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుగ్యాల సుధాకర్



**ప్రజాపక్షం/మణుగూరుః** ‘సేవ్ మణుగూరు’ పేరుతో జరుగు దీక్షలకు మణుగూరు పట్టణ ప్రజలు వ్యాపారస్తులు అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల నాయకులు, పట్టణ పుర ప్రముఖులు, అన్ని వర్గాల ప్రజలు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని సిపిఐ మణుగూరు పట్టణ కార్య దర్శి దుగ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు విజ్ఞప్తి చేశారు. ఆదివారం సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మణుగూరు ఏరియాలో సింగరేణి సంస్థను1974 సంవత్స రంలో మణుగూరు పీకే 1, గని ప్రారంభించుకొని అంచెలంచెలుగా సింగ రేణి అభివృద్ధికై పాటుపడుతూ కార్మికుల సంక్షేమం కోసం స్థానికంగా ఉన్నటువంటి రైతులు వ్యవసాయ కూలీలు సైతం ఈ ప్రాంత అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని భూములను సైతం సింగరేణి ఇస్తూ సింగరేణి అభివృ ద్ధికి చేయూతను అందించారు. కానీ నేడు రాను రాను మణుగూరు భవి ష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది అన్నారు. సింగరేణిని నమ్ముకుని అనే కమంది ప్రత్యక్షంగా, పరోక్షంగా దీని మీద ఆధారపడి సుమారు 5000 మంది జీవిస్తున్నారన్నారు. కావున సింగరేణి పీకే ఓసి డిప్ సైడ్ బ్లాక్ ను వెంటనే సింగరేణికి అప్పగించాలని, మణుగూరు మనుగడకై మణుగూరు ఓసి ఎక్స్‌టెన్షన్ పనులు పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలని, తదితర డిమాండ్స్ తో మణుగూరులో అంబేద్కర్ సెంటర్లో సింగరేణి కాల రీస్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) ఆధ్వర్యంలో రెండు రోజులు జరుగు దీక్షలకు మణుగూరులో ఉన్నటువంటి అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల నాయకులు, వ్యాపారస్తులు, పట్టణ ప్రముఖులు, ఉద్యోగ, వ్యాపార వర్గాలందరూ తమ సంపూర్ణమైన మద్దతు ప్రకటించి సింగరేణి సేవ్ పేరుతో సింగరేణిని కాపాడుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ విజ్ఞప్తి చేస్తుందన్నారు.ఈకార్యక్రమంలో సిపిఐ మణుగూరు పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్, ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, కోశాధికారి కొత్తపల్లి సీతారాములు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం/మణుగూ–రుః** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుం బాల ఆడబిడ్డల వివాహా లకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మి పథకం ద్వారా పినపాక మండలం టి కొత్త గూడెం గ్రామానికి చెందిన ఎరుకొండ లక్ష్మి నిర్మలకు మంజూ రైన కల్యాణ లక్ష్మి చెక్కును పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటే శ్వర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లా డుతూ ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేస్తోందన్నారు. పేద కుటుంబాలపై వివాహ ఖర్చుల భారం తగ్గించేందుకు కల్యాణ లక్ష్మి పథకం ఎంతో ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. లబ్ధిదారురాలు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకి కృతజ్ఞతలు తెలిపారు.

## అర్హులైన కూలీలందరికీ.. జాబ్ కార్డులు ఇవ్వాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** గ్రామీణ ప్రాంతంలోని ఉపాధి హామీ పథకం కింద అర్హులైన కూలీలందరికీ నూతన జాబ్‌కార్డులు ఇవ్వాలని వ్యవ సాయ కార్మికయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దినేని కర్ణ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని భైరవునిపల్లి గ్రామంలో ఆదివారం వెంకన్న అధ్యక్షతన నిర్వహించిన గ్రామశాఖ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామీణ పేదల జీవ నోపాధికి భద్రత కల్పించాల్సిన ఉపాధిహామీ పథకాన్ని అధికారులు, ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి, సహాయ కార్యదర్శులు మారిశెట్టి వెంకటేశ్వరరావు, మల్లెబోయిన ఉపేందర్, గ్రామశాఖ కార్యదర్శి బాలిన కృష్ణంరాజు, సహాయ కార్యదర్శి బాలెబోయిన వెంకటేశ్వర్లు, సభ్యులు కుంచం భిక్షం, ముత్యాల వెంకటేశ్వరరావు, బాలిన పెద్ద నారాయణ, బాలిన చిన్న నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కుంచపర్తిలో గుప్త నిధుల తవ్వకాలు

11 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
11 సెల్‌ఫోన్లు, 6 బైకులు స్వాధీనం



**ప్రజాపక్షం/సత్తుపల్లిః** సత్తుపల్లి నియోజకవర్గం వేంసూరు మండలంలోని కుంచపర్తి గ్రామ శివారులో ఉన్న మారెమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, విలేకరుల సంయుక్త స్టింగ్ ఆపరేషన్‌తో ఈ వ్యవహారం బయటప డగా, 11 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 11 సెల్‌ఫోన్లు, 6 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... శనివారం అర్ధరాత్రి ఆలయ పరిసర ప్రాంతంలో గుప్త నిధుల తవ్వకాలు జరు గుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో కల్లూరు ఎసిపి వసుంధర యాదవ్ ఆదేశాలతో వి.ఎం. బంజర ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందం ఏర్పాటైంది. మీడియా ప్రతినిధులతో కలిసి పోలీస్‌లు స్టింగ్ ఆపరేషన్ చేపట్టి ఆలయ పరిసరాల్లో నిఘా ఏర్పాటు చేశారు. ఆదివారం తెల్ల వారుజామున అందిన పక్కా సమాచారంతో పోలీస్‌లు ఆలయ ప్రాంగణం లోకి ప్రవేశించగా, అక్కడ విద్యుత్ దీపాల వెలుతురులో కొందరు వ్యక్తులు భారీ లోతుతో గొయ్యి తవ్వుతున్నట్లు గుర్తించారు. వారిని ప్రశ్నించగా గుంటూరు, ఏన్కూరు ప్రాంతాల నుంచి తవ్వకాల కోసం వచ్చినట్లు తెలిపారు. ఆలయ పూజారి సూచనల మేరకు గుప్త నిధుల కోసం బావి తరహాలో లోతుగా తవ్వాలని చెప్పడంతో పనులు చేపట్టినట్లు వెల్లడించారు. తవ్వకాల సమయంలో భారీ బండరాయి ఎదురవడంతో పలుగు, గడ్డపారలతో తవ్వడం కష్టమైందని, అందుకే డ్రిల్ మిషన్‌ను కూడా వినియోగించినట్లు వారు అంగీక రించినట్లు సమాచారం. పని నిలిపివేయాలని తాము చెప్పగా, తవ్వకాలు పూర్తి చేయాలని, లేకపోతే ప్రమాదాలు ఎదురవుతాయని పూజారి భయపెట్టి నట్లు వారు పోలీసులకు తెలిపినట్లు తెలిసింది. ఘటనకు సంబంధించి 11 మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని, తవ్వకాల వెనుక ఉన్న అసలు సూత్రధారులు, ఇతర వివరాలపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీ సులు తెలిపారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## మొహర్రం త్యాగానికి, సత్యానికి నిదర్శనం

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మొహర్రం త్యాగానికి, సత్యానికి నిదర్శనమని, ఈ పండుగ విశిష్టతను ప్రతి ఒక్కరూ చాటిచెప్పాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా అన్నారు. 26న జరగనున్న మొహర్రంను పురస్కరించుకుని జరుగుతున్న ప్రత్యేక కార్యక్ర మాల నేపథ్యంలో ఆదివారం పాతకొత్తగూడెంలోని హజరత్ అలీ అబ్బాస్ ఆషూర్ కనాను సందర్శించారు. ఈ సంద ర్భంగా అక్కడ జరుగుతున్న ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న అనం తరం ఆయన మాట్లాడుతూ మొహర్రం రోజుల్లో నిర్వహించే ప్రత్యేక పూజల వల్ల సమాజంలో శాంతి సౌభాగ్యాలు వికసిస్తా యని, లోకకల్యాణం జరుగుతుందని ఆకాంక్షించారు. ఈ వేడుకలు గంగాజమునా తెహజీబ్‌కు, మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. పవిత్రమైన ఈ రోజుల్లో భక్తులందరూ భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నా లని, ప్రతి ఒక్కరూ సోదరభావంతో పండుగను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇలాంటి ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతి మానవుడికి మానసిక ప్రశాంతత లభిస్తుందని, సమా జంలో ఐక్యత పెరుగుతుందని వివరించారు. ఆషూర్ కనా కమిటీ నిర్వాహకులు చేస్తున్న ఏర్పాట్లను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో నయీమ్ ఖురేషి, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, పడాల భవాని, రామారావు, సాంబిరెడ్డి, ఇమ్రాన్, జమాలుద్దీన్, మొహమ్మద్ అలీ, జడల అరుణ తదితరులు పాల్గొన్నారు.

## 15వ పటాలంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం



**ప్రజాపక్షం/సత్తుపల్లిః** మండల పరిదిలోని బేతుపల్లిగంగారం గ్రామంలో గల 15వ ప్రత్యేక పోలీసు పటాలంలో ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పటాల కమాండెంట్ ఎ.అంజయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హార్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్‌కు చెందిన యోగా శిక్షకుడు వెంక టేశ్వర్లు ప్రత్యేక ఆహ్వానితుడిగా పాల్గొని యోగా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ నేటి వేగవంతమైన జీవనశైలిలో శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్ష ణకు యోగా అత్యంత అవసరమని తెలిపారు. నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకోవడం ద్వారా ఒత్తిడి తగ్గి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం పటాలంలోని అధికా రులు, సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు యోగా ఆసనాలు, ప్రాణాయామ సాధనలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ వేణుగోపాల్ రెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్ ఐలు, ఇతర అధికారులు, సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆరోగ్యకర జీవ న విధా నంపై అవగాహన పెంపొందించేలా కార్యక్రమం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

## పెనుబల్లిలో ప్రొ. జయశంకర్ వర్ధంతి



**ప్రజాపక్షం/పెనుబల్లిః** పెనుబల్లి మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు కోటగిరి సుధాకర్ బాబు ఇంటి వద్ద ప్రొఫెసర్ జయ శంకర్ వర్ధంతిని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు వెంకట వీరయ్య హాజర య్యారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఏర్పా టుకు ప్రొఫెసర్ జయశంకర్ దశ దిశ నిర్దేశించారని , ప్రత్యేక రాష్ట్ర ఏర్పా టులో ముఖ్య పాత్ర పోషించారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమా నికి ఆయన ఆశయాలు స్ఫూర్తి దాయ కమని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కోసం ఆయన జీవితాన్ని త్యాగం చేశారని కొనియాడారు. ఈ కార్యక్ర మంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కనగాల వెంకటరావు, మాజీ జెడ్‌పిటిసి చెక్కిలాల మోహన్‌రావు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మధిరలో యోగా దినోత్సవం

**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** మధిరలో 12వ అంతర్జాతీయ యోగా దినో త్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పబ్బతి సుబ్బారావు, ధన లక్ష్మి వర్తక సంఘ కల్యాణమండపంలో యోగా గురూజీ నాళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గత మూడు దశాబ్దాలుగా ఉచితంగా యోగా తరగతులు నిర్వహి స్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగా సాధకులు దెందుకూరు ప్రభుత్వ వైద్యులు పృధ్విరాజ్, ఎం.రామారావు, నాగేశ్వరమ్మ, అప్పారావు, కె.కృష్ణ, పీ.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

